

WWW.VIJAYAKERATAM.COM

RNI: APTEL/2010/34724

తెలుగు దినపత్రిక

విజయకెరటం

నిజం మా ధ్యేయం - ప్రజలే మా లక్ష్యం

VIJAYA KERATAM TELUGU DAILY



సెప్టెంబర్ 27 ఆదివారం 2026 | సంపుటి : 18 | సంచిక : 234 | పేజీలు : 4 | వెల రూ. 1.00/- | ఎడిటర్ : యం.డి.మక్సూద్ అహ్మద్

sunDAY SEPTEMBER 27 2026 | VOL:18 | ISSUE: 234 | PAGES:4 | Rs. 1:00 | EDITOR:MD. MaKsood Ahmed

'కాంగ్రెస్ లక్ష్యమేంటో బయటపడింది'..

రేవంత్ 'గాంధీ పరివార్'పై బీజేపీ ఫైర్

- రేవంత్ వ్యాఖ్యలపై బీజేపీ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ విమర్శలు
- కాంగ్రెస్ లక్ష్యం గాంధీ కుటుంబాన్ని అధికారంలోకి తేవడమేనని ఆరోపణ
- రేవంత్ వ్యాఖ్యల వీడియోను 'ఎక్స్'లో పంచుకున్న భండారీ
- ఎమర్జెన్సీ, 1984 అల్లర్ల వంటి అంశాల ప్రస్తావన
- నిలంబూర్‌లో బెస్ట్ పబ్లిక్ సర్వెంట్ అవార్డు అందుకుంటూ రేవంత్ వ్యాఖ్యలు



తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి చేసిన 'గాంధీ పరివార్–సంఘ్ పరివార్' వ్యాఖ్యలు రాజకీయంగా చర్చకు దారితీశాయి. కేరళలోని నిలంబూర్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో రేవంత్ మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తు కోసం జరుగుతున్న రాజకీయ పోరు ఈ రెండు పరివార్ల మధ్యేనని అన్నారు. ఈ వ్యాఖ్యలపై బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ స్పందించారు. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోను భండారీ సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో పంచుకున్నారు. రేవంత్ 'గాంధీ పరివార్' కోసం తన

(మిగతా 2వ పేజీలో..)

'పండగల సీజన్‌లో బంగారం కొనొద్దు'..

ప్రధాని మోదీ విజ్ఞప్తి ఫలిస్తుందా?

- బంగారం కొనుగోళ్లు తగ్గించాలని భారతీయులకు ప్రధాని మోదీ మరోసారి పిలుపు
- విదేశీ మారక ద్రవ్యం ఆదా చేసేందుకే ఈ విజ్ఞప్తి
- పండగల సీజన్‌లో ఈ పిలుపునకు స్పందనపై ఉత్కంఠ
- వినాయక చవితికి 15 శాతం మేర తగ్గిన బంగారం అమ్మకాలు
- పెట్టుబడికి భౌతిక బంగారం కన్నా ఈటీఎఫ్‌లు మేలంటున్న నిపుణులు

అత్యవసరమైతే తప్ప బంగారం కొనుగోళ్లకు దూరంగా ఉండాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారతీయులకు మరోసారి విజ్ఞప్తి చేశారు. దేశ విదేశీ మారక ద్రవ్య (ఫారెక్స్) నిల్వలను కాపాడుకునేందుకు ఈ చర్య దోహదపడుతుందని ఆయన సూచించారు. త్వరలో రానున్న ధన్‌తేరస్, దీపావళి వంటి కీలక పండగల నేపథ్యంలో ప్రధాని పిలుపునకు ప్రజల నుంచి ఎలాంటి స్పందన వస్తుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.ఇరాన్ యుద్ధం కారణంగా ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడుతున్న నేపథ్యంలో, 2026 మే నెలలో మోదీ తొలిసారి ఈ విజ్ఞప్తి చేశారు. తాజాగా

(మిగతా 2వ పేజీలో..)



గణేశ్ నిమజ్జనం సక్సెస్.. పోలీసులతో కలిసి డ్యాన్స్ చేసిన సీపీ సజ్జనార్

- హైదరాబాద్‌లో ప్రశాంతంగా ముగిసిన గణేశ్ నిమజ్జనం
- విజయవంతమైన బందోబస్తుతో పోలీసుల సంబరాలు
- సిబ్బందితో కలిసి డ్యాన్స్ చేసిన హైదరాబాద్ సీపీ సజ్జనార్
- ట్యాంక్‌బండ్, అసెంబ్లీ వైపు ట్రాఫిక్ ఆంక్షల ఎత్తివేత

హైదరాబాద్ నగరంలో గణేశ్ నిమజ్జన ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తును విజయవంతంగా నిర్వహించడంతో పోలీసు యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. ఈ సందర్భంగా హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ తన సిబ్బందితో కలిసి సంబరాలు జరుపుకున్నారు.నిమజ్జన ప్రక్రియ ముగిసిన అనంతరం, తెలంగాణ

(మిగతా 2వ పేజీలో..)



తెలంగాణ తెగువకు, ధిక్కార స్వరానికి ఐలమ్మ నిలువెత్తు రూపం: కేసీఆర్

- నేడు చాకలి ఐలమ్మ 131వ జయంతి
- ఘన నివాళి అర్పించిన కేసీఆర్
- నాటి రాచరిక వ్యవస్థను ధైర్యంగా ఎదిరించిన వీరవనిత అని కేసీఆర్ కితాబు
- ఐలమ్మ పోరాట పటిమ నేటి యువతకు ఆదర్శనీయమని వ్యాఖ్య



తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, ఆత్మగౌరవ ప్రతీక చాకలి ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన ఒక ప్రత్యేక ప్రకటన విడుదల చేస్తూ... తెలంగాణ తెగువకు, ధిక్కార స్వరానికి ఆమె నిలువెత్తు రూపమని కొనియాడారు. నాటి రాచరిక వ్యవస్థను ధైర్యంగా ఎదిరించి, రైతాంగ హక్కుల కోసం పోరాడిన ధీర వనిత అని ప్రశంసించారు. అణచివేతకు గురవుతున్న బడుగు, బలహీన వర్గాల ఆత్మగౌరవాన్ని ఆమె ప్రపంచానికి చాటిచెప్పారని పేర్కొన్నారు. కేవలం భూస్వాములను వ్యతిరేకించడమే కాకుండా, అప్పట్లోనే చట్టాల పరిధిలో కోర్టుల ద్వారా న్యాయం పొంది ఆమె ప్రజాస్వామిక నిబద్ధతను చాటుకున్నారని కేసీఆర్ గుర్తుచేశారు. ఐలమ్మ పోరాట పటిమ నేటి యువతకు ఎప్పుడూ ఆదర్శనీయమని, ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ఆమె స్ఫూర్తి చాలా అవసరమని అభిప్రాయపడ్డారు. తాను చేపట్టిన శాంతియుత మలిదశ తెలంగాణ ఉద్యమంలోనూ ఆమె పోరాట స్ఫూర్తి అంతర్భాగంగా ఉందన్నారు. చాకలి ఐలమ్మ చరిత్రను భావితరాలకు తెలియజేయాలనే ఉద్దేశంతోనే తమ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆమె జయంతిని అధికారికంగా నిర్వహించే సంప్రదాయానికి శ్రీకారం చుట్టామని కేసీఆర్ వెల్లడించారు. ఐలమ్మ ఆశయాల సాధనే ధ్యేయంగా తాము అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో మహిళా, శిశు సంక్షేమంతో పాటు రైతాంగం, సబ్బండ కులాల అభ్యున్నతికి ఎన్నో విప్లవాత్మక పథకాలను అమలు చేశామని తెలిపారు. కులవృత్తులకు పునరుజ్జీవం పోసి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా తెలంగాణ ఆత్మగౌరవాన్ని మహోన్నతంగా నిలబెట్టామని, ఆనాడు తాము సాధించిన ప్రగతి నేడు దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిందని ఆయన పేర్కొన్నారు.

(మిగతా 2వ పేజీలో..)

రేవంత్ 'నిజాయతీ గల మోసగాడు': కేటీఆర్

- రైతుబంధుపై ప్రభుత్వాన్ని తప్పుబట్టిన కేటీఆర్
- హామీలు అమలు కాలేదని ఆరోపణ
- కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో అసంతృప్తి
- 2028లో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని ధీమా



సెప్టెంబర్ 28 నుంచి పట్టభద్రుల ఓటరు నమోదుకు పిలుపు

సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. రేవంత్ 'నిజాయతీ గల మోసగాడు' అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ప్రజలు పాలిచ్చే

(మిగతా 2వ పేజీలో..)

కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్ధరణ పనులు.. ప్రభుత్వం కీలక ప్రకటన

- కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణకు రంగం సిద్ధం
- నవంబర్ రెండో వారం నుంచి పనులు ప్రారంభం
- 2027 వర్షాకాలం నాటికి పూర్తి చేయాలని లక్ష్యం
- అక్టోబర్ 5న సీడబ్ల్యూసీకి డిజైన్లు సమర్పించనున్న అధికారులు
- భద్రత, నాణ్యతలో రాజీ లేదన్న మంత్రి ఉత్తమ్



కాళేశ్వరం ప్రాజెక్టులో కీలకమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ పనులు నవంబర్ రెండో వారంలో ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి

(మిగతా 2వ పేజీలో..)



విజయకేరటం
తెలుగు దినపత్రిక

02 జనరల్ న్యూస్

సం పా ద కీ యం

గణేశ్ నిమజ్జనం.. భక్తికి భంగం లేకుండా, పర్యావరణానికి హాని లేకుండా!

వినాయక చవితి ఉత్సవాల్లో అత్యంత ప్రధాన ఘట్టం గణేశ్ నిమజ్జనం. ఎన్నో రోజులపాటు భక్తిశ్రద్ధలతో పూజించిన గణనాథుడిని ఘనంగా ఊరేగించి, నిమజ్జనం చేసి వీడ్కోలు పలకడం ఆనవాయితీ. భక్తి, ఉత్సాహం, సంబరాలతో జరిగే ఈ కార్యక్రమం ప్రజలంతా కలిసికట్టుగా పాల్గొనే సామూహిక వేడుకగా నిలుస్తోంది. అయితే ఉత్సవం ఎంత వైభవంగా జరుగుతుందో.. నిమజ్జనం కూడా అంతే బాధ్యతాయుతంగా జరగాల్సిన అవసరం ఉంది.భక్తి పేరుతో చెరువులు, సరస్సులు, నదుల్లో ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు, రసాయనిక రంగులతో వేసిన అలంకరణలు నిమజ్జనం చేయడం వల్ల జల కాలుష్యం పెరిగే ప్రమాదం ఉంది. విగ్రహాల్లో ఉపయోగించే కొన్ని పదార్థాలు నీటిలో సులభంగా కలవకపోవడం, పూలమాలలు, ప్లాస్టిక్ కవర్లు, ఇతర అలంకరణ వ్యర్థాలు నీటిలో చేరడం వల్ల జలవనరులపై ప్రతికూల ప్రభావం పడుతుంది. భక్తి ముగిసిన వెంటనే ప్రకృతికి భారంగా మారే పరిస్థితి రాకుండా జాగ్రత్తలు అవసరం.

మట్టి వినాయకుడే మేలు

పర్యావరణహిత వినాయక విగ్రహాల వినియోగాన్ని ప్రోత్సహించడం కాలానుగుణ అవసరం. సహజ మట్టితో తయారు చేసిన విగ్రహాలు నీటిలో సులభంగా కలిసిపోవడంతో కాలుష్య ప్రభావం తక్కువగా ఉంటుంది. సహజ రంగులను వినియోగించడం, ప్లాస్టిక్ అలంకరణలకు దూరంగా ఉండటం, పునర్వినియోగించగల వస్తువులను ఉపయోగించడం ద్వారా నిమజ్జనం తర్వాత ఏర్పడే వ్యర్థాలను గణనీయంగా తగ్గించవచ్చు.

'మన పండుగ--మన బాధ్యత' అనే భావన ప్రతి భక్తుడిలో పెరగాలి. దేవుడి పట్ల భక్తి చూపడం అంటే దేవుడి సృష్టి అయిన ప్రకృతిని కాపాడడం కూడా. అందుకే పర్యావరణహిత ఉత్సవాలకు ప్రజలు పెద్దపీట వేయాలి.

నిమజ్జన ప్రాంతాల్లో సమగ్ర ఏర్పాట్లు

నిమజ్జనం రోజున భారీ సంఖ్యలో ప్రజలు జలాశయాల వద్దకు చేరుకుంటారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం, స్థానిక సంస్థలు ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేయాలి. ప్రత్యేక నిమజ్జన కొలనులు, తాత్కాలిక మార్గాలు, వెలుతురు, పారిశుద్ధ్య సదుపాయాలు, తాగునీరు, వైద్య శిబిరాలు, అత్యవసర సేవలు అందుబాటులో ఉండాలి.ముఖ్యంగా చిన్నారులు, మహిళలు, వృద్ధులు, ఈత రాని వారు నీటికి దగ్గరగా వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. నిమజ్జన సమయంలో ప్రమాదాలు జరగకుండా పోలీసు, మున్సిపల్, రెవెన్యూ, వైద్య, అగ్నిమాపక శాఖలు సమన్వయంతో పనిచేయాలి. రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణకు ముందస్తు ప్రణాళిక అవసరం.

ఊరేగింపుల్లో క్రమశిక్షణ తప్పనిసరి

గణేశ్ శోభాయాత్రలు పండుగలో ప్రత్యేక ఆకర్షణ. అయితే అధిక శబ్దం, రోడ్లపై అనవసర రద్దీ, ఇతరులకు ఇబ్బంది కలిగించే విధంగా ఊరేగింపులు నిర్వహించడం సరైంది కాదు. శోభాయాత్రలు ప్రశాంతంగా, క్రమశిక్షణతో సాగాలి. నిర్దిష్ట మార్గాలు, సమయాలను పాటించాలి. శబ్ద కాలుష్యాన్ని తగ్గించేందుకు నిబంధనలను గౌరవించాలి.పండుగ ఉత్సాహం పేరుతో మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి నిర్లక్ష్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలి. ఒక్క చిన్న తప్పిదం కూడా ప్రాణ నష్టానికి దారితీయవచ్చు. కాబట్టి ఆనందం బాధ్యతను మించిన స్థాయికి వెళ్లకూడదు.

జలాశయాల పరిరక్షణ కూడా మన బాధ్యతే

చెరువులు, సరస్సులు, నదులు కేవలం నిమజ్జన ప్రదేశాలు కావు. అవి భవిష్యత్ తరాలకు అవసరమైన సహజ వనరులు. పండుగల సమయంలో మాత్రమే కాకుండా ఏడాది పొడవునా వాటి పరిశుభ్రతను కాపాడాలి. నిమజ్జనం అనంతరం విగ్రహ అవశేషాలు, పూజా సామగ్రి, ప్లాస్టిక్ వ్యర్థాలను వెంటనే తొలగించేలా ప్రత్యేక బృందాలు పనిచేయాలి.నిమజ్జనం పూర్తయిన తర్వాత కూడా వ్యర్థాల నిర్వహణపై అధికారులు దృష్టి కొనసాగించాలి. పూజా సామగ్రిని వేరు చేసి శాస్త్రీయంగా నిర్వహించడం, ప్లాస్టిక్ వ్యర్థాలను పునర్వినియోగానికి పంపడం, జలాశయాల్లో మిగిలిన అవశేషాలను తొలగించడం వంటి చర్యలు తప్పనిసరి.

భక్తి.. సామరస్యానికి ప్రతీక కావాలి

గణేశ్ ఉత్సవాలు ప్రజలను ఒక్కచోట చేర్చే సామాజిక వేదిక. కుల, మత, వర్గ భేదాలకు అతీతంగా ప్రజలు కలిసి పండుగను జరుపుకోవడం మన సామాజిక బలానికి నిదర్శనం. ఈ సందర్భంలో పరస్పర గౌరవం, సహనం, సోదరభావం మరింత పెరగాలి. చిన్నచిన్న వివాదాలకు తావులేకుండా నిర్వాహకులు, ప్రజలు సంయమనంతో వ్యవహరించాలి.పోలీసులు, అధికారులు ఇచ్చే సూచనలను పాటిస్తూ పండుగను ప్రశాంతంగా ముగించడం ప్రతి ఒక్కరి బాధ్యత. పండుగ ముగిసిన తర్వాత కూడా ప్రజల మధ్య ఆత్మీయత, స్నేహభావం కొనసాగితేనే ఉత్సవ స్ఫూర్తి సార్థకమవుతుంది.

పండుగకు కొత్త నిర్వచనం అవసరం

కాలం మారుతున్న కొద్దీ పండుగల నిర్వహణలోనూ మార్పులు రావాలి. పెద్ద విగ్రహం, భారీ శబ్దం, భారీ ఖర్చే ఘనతకు కొలమానం కాకూడదు. పర్యావరణహిత విగ్రహం, నియంత్రిత శబ్దం, సురక్షిత నిమజ్జనం, శుభ్రమైన పరిసరాలు ఉన్నప్పుడే నిజమైన పండుగ వాతావరణం ఏర్పడుతుంది.గణనాథుడిని భక్తితో ఆరాధించి.. అదే భక్తితో ప్రకృతిని కూడా కాపాడాలి. నిమజ్జనం భక్తికి ముగింపు కావచ్చు కానీ బాధ్యతకు కాదు. విగ్రహాన్ని నీటిలో కలిపిన తర్వాత మన బాధ్యతలు ముగియవు; ఆ నీరు, ఆ పరిసరాలు, ఆ జీవవ్యవస్థను కాపాడే బాధ్యత అప్పుడే మొదలవుతుంది.

గణేశ్ నిమజ్జనం భక్తి, భద్రత, పర్యావరణ పరిరక్షణకు సమన్వయంగా మారాలి. ఉత్సవం మనకు ఆనందాన్ని ఇవ్వాలి.. నిమజ్జనం ప్రకృతికి నష్టాన్ని మిగల్చకూడదు. అదే గణనాథుడికి మనం ఇచ్చే నిజమైన గౌరవం.

కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్ధరణ పనులు.. ప్రభుత్వం కీలక ప్రకటన

మొదటి పేజీ తరువాయి)

ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. హైదరాబాద్‌లో ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పనుల పురోగతిపై సుదీర్ఘంగా చర్చించారు.బ్యారేజీల పునరుద్ధరణకు సంబంధించిన డిజైన్లను అక్టోబర్ 5న కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) సాంకేతిక పర్యవేక్షణ కమిటీకి సమర్పించనున్నట్లు మంత్రి తెలిపారు. కేంద్రం నుంచి అవసరమైన సాంకేతిక అనుమతులు లభించిన వెంటనే పనులు మొదలుపెడతామని స్పష్టం చేశారు. 2027 వర్షాకాలం నాటికి ఈ మూడు బ్యారేజీల పునరుద్ధరణ పనులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు.బ్యారేజీల భద్రత, నాణ్యత విషయంలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడబోదని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. జాతీయ డ్యామ్ భద్రతా అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) సహా నిపుణుల కమిటీలు లేవనెత్తిన అభ్యంతరాలను, సూచనలను పరిగణనలోకి తీసుకున్నామని, జాతీయ స్థాయి సాంకేతిక సంస్థల సిఫార్సుల మేరకే పనులు చేపడతామని వెల్లడించారు. ఈ మూడు బ్యారేజీల భద్రతను పటిష్టం చేసి, వాటి పూర్తి సామర్థ్యాన్ని పునరుద్ధరించడమే ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యత అని ఆయన ఈ సమావేశంలో నొక్కిచెప్పారు.

'పండగల సీజన్‌లో బంగారం కొనొద్దు'.. ప్రధాని మోదీ విజ్ఞప్తి ఫలిస్తుందా?

సెప్టెంబర్‌లోనూ ఆయన ఇదే విషయాన్ని గుర్తుచేశారు. భారత్ తన అవసరాలకు సంబంధించి అత్యధిక శాతం బంగారాన్ని దిగుమతుల ద్వారానే పొందుతోంది. 2026 రెండో త్రైమాసికంలో దేశీయ సరఫరాలో 82 శాతం దిగుమతుల నుంచే లభించింది. దీనివల్ల డాలర్ల రూపంలో చెల్లింపులు పెరిగి, సుమారు 780 నుంచి 785 బిలియన్ డాలర్లుగా ఉన్న ఫారెక్స్ నిల్వలపై ఒత్తిడి పెరుగుతోంది.ప్రధాని విజ్ఞప్తి ప్రభావం ఇప్పటికే కొంతమేర కనిపిస్తోంది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో అనవసర కొనుగోళ్లు తగ్గినట్లు తెలుస్తోంది. ఈ ఏడాది వినాయక చవితి సందర్భంగా బంగారం అమ్మకాల పరిమాణం సుమారు 15 శాతం మేర తగ్గింది. వినియోగదారులు ఎక్కువగా తేలికపాటి ఆభరణాలను ఎంచుకోవడం లేదా పాత బంగారాన్ని మార్చుకోవడం వంటి పద్ధతులకు మొగ్గు చూపుతున్నారు.పండగల సమయంలో బంగారం కొనుగోలు చేయడం అనేది సంప్రదాయం, భావోద్వేగాలతో ముడిపడి ఉంటుందని గ్రోత్‌వైన్ క్యాపిటల్ నిపుణుడు శుభమ్ గుప్తా అభిప్రాయపడ్డారు. ఇప్పటికే తగినంత బంగారం ఉన్నవారు ఈసారి లాంఛనంగా కొద్ది మొత్తంలో కొనుగోలు చేయడం మేలని ఆయన సూచించారు. కేవలం పెట్టుబడి కోసమైతే, భౌతిక బంగారానికి బదులుగా గోల్డ్ ఈటీఎఫ్‌లు లేదా గోల్డ్ మ్యూచువల్ ఫండ్స్ ఉత్తమ ప్రత్యామ్నాయాలని ఆయన వివరించారు. ఏదేమైనా, ప్రధాని పిలుపునకు అసలైన పరీక్ష రాబోయే పండగల సీజన్‌లోనే ఎదురుకానుంది.

రేవంత్ 'నిజాయతీ గల మోసగాడు': కేటీఆర్

మొదటి పేజీ తరువాయి)

బర్రెను వదిలి తన్నే దున్నపోతును తెచ్చుకున్నారని అన్నారు. తెలంగాణ భవన్‌లో శనివారం మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. సత్తూరి యాదగిరి అధ్వర్యంలో జరిగిన ఈ చేరికల కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడారు.కేసీఆర్ ప్రజల తీర్పును గౌరవించి కాంగ్రెస్ ప్రభుత్వానికి అవకాశం ఇచ్చారని కేటీఆర్ అన్నారు. మూడేళ్లుగా కేసీఆర్ ప్రజల్లోకి రాకపోయినా గల్లీ గల్లీలో ఆయన పాటలు వినిపిస్తున్నాయని పేర్కొన్నారు.కేసీఆర్ హయాంలో రైతులు నాట్లు వేసే సమయానికే రైతుబంధు డబ్బులు ఖాతాల్లో పడేవని కేటీఆర్ చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం ఇప్పటివరకు మూడుసార్లు రైతుబంధు ఇవ్వలేదని ఆరోపించారు. 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలతో పాటు హామీలన్నీ అమలు చేస్తామని చెప్పి ఒక్క హామీ కూడా పూర్తిగా నెరవేర్చలేదని విమర్శించారు.ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపిస్తే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని భావించారని కేటీఆర్ అన్నారు. కానీ పరిస్థితి 'అన్న వస్త్రానికి పోతే ఉన్న వస్త్రం పోయినట్లు' తయారైందని వ్యాఖ్యానించారు. మహబూబాబాద్‌లో కాంగ్రెస్‌కు ఓటేసి గెలిపించిన నాయకుడు కనిపించకుండా పోయారని ఎద్దేవా చేశారు. 2028 ఎన్నికల్లో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని చెప్పారు. కాంగ్రెస్, బీజేపీ వైఖరిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 28 నుంచి చేపట్టే పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు.

గణేశ్ నిమజ్జనం సక్సెస్.. పోలీసులతో కలిసి డ్యాన్స్ చేసిన సీపీ సజ్జనార్

మొదటి పేజీ తరువాయి)

తల్లి ఫ్లైఓవర్ కింద పోలీసు సిబ్బందితో కలిసి సీపీ సజ్జనార్ నృత్యం చేశారు. 'ది ప్యారడైజ్' చిత్రంలోని 'ఆయా షేర్' పాటకు ఆయన చిందులేశారు. గత కొన్ని రోజులుగా విధుల్లో నిమగ్నమై అప్రమత్తంగా ఉన్న పోలీసులు, నిమజ్జనం ప్రశాంతంగా పూర్తి కావడంతో ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఉన్నతాధికారి స్వయంగా వారితో కలవడంతో సిబ్బందిలో ఉత్సాహం రెట్టింపైంది. మరోవైపు, నగరంలో నిమజ్జన క్రతువు ముగియడంతో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలను ఎత్తివేశారు. సచివాలయం పరిసర ప్రాంతాలైన ట్యాంక్‌బండ్, లిబర్టీ, అసెంబ్లీ మార్గాల్లో వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. దీంతో ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ సాధారణ స్థితికి చేరుకుంది.

'కాంగ్రెస్ లక్ష్యమేంటో బయటపడింది'.. రేవంత్ 'గాంధీ పరివార్'పై బీజేపీ ఫైర్

మొదటి పేజీ తరువాయి)

ప్రాణాలను సైతం త్యాగం చేయడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పిన విషయాన్ని ప్రస్తావించారు.

'కాంగ్రెస్ లక్ష్యం అదే' అంటూ ఆరోపణ

రేవంత్ వ్యాఖ్యలు కాంగ్రెస్ రాజకీయ లక్ష్యాన్ని బయటపెట్టాయని భండారీ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రధాన ఉద్దేశం గాంధీ కుటుంబాన్ని తిరిగి అధికారంలోకి తీసుకురావడమేనని ఆయన వ్యాఖ్యానించారు. ఎన్నికల సంఘం, రాజ్యాంగం, ప్రజాస్వామ్యం వంటి అంశాల కంటే కుటుంబ రాజకీయాలకే కాంగ్రెస్ ప్రాధాన్యం ఇస్తోందని విమర్శించారు.గాంధీ-వాద్రా కుటుంబ పాలన అంటూ విమర్శలు గుప్పించిన భండారీ పలు చారిత్రక, రాజకీయ అంశాలను ప్రస్తావించారు. ఎమర్జెన్సీ, 1984 సిక్కు వ్యతిరేక అల్లర్లు, 26/11 ముంబయి ఉగ్రదాడుల సమయంలో భారత స్పందన వంటి అంశాలను ఆయన గుర్తుచేశారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం, దేశ ఆర్థిక పరిస్థితి, పేదరికం వంటి అంశాలపైనా వ్యాఖ్యలు చేశారు.

అసలు రేవంత్ ఏం అన్నారు?

నిలంబూర్‌లో ఆర్యదాన్ ముహమ్మద్-2026 బెస్ట్ పబ్లిక్ సర్వెంట్ అవార్డు అందుకున్న సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడారు. దేశ భవిష్యత్తు కోసం 'గాంధీ పరివార్', 'సంఘ్ పరివార్' మధ్య పోరు జరుగుతోందని అన్నారు. గాంధీ కుటుంబానికి చెందిన పలువురు దేశం కోసం త్యాగాలు చేశారని పేర్కొన్నారు. రాహుల్ గాంధీని ప్రధానిగా చూడటమే తనకు మిగిలిన రాజకీయ లక్ష్యమని కూడా చెప్పారు.

జోరు పెంచిన ప్రశాంత్ కిశోర్.. ఢిల్లీలో రేపు అత్యంత కీలక సమావేశం

పూర్తి స్థాయి పొలిటీషియన్ గా మారిన ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్

బంకిపూర్ ఉప ఎన్నికలో స్వయంగా విజయం సాధించి సత్తా చాటిన పీకే

దేశ రాజధాని ఢిల్లీకి పార్టీని విస్తరించే పనుల్లో ప్రశాంత్ కిశోర్

ఎన్నికల వ్యూహకర్తగా సుపరిచితులైన ప్రశాంత్ కిశోర్... ఇప్పుడు రాజకీయ నాయకుడిగా తన ప్రయాణాన్ని మరింత ముందుకు తీసుకెళ్తున్నారు. 'జన్ సూరజ్ పార్టీ' (జేఎస్పీ) అధినేత అయిన ఆయన, ఇప్పుడు జాతీయ రాజధాని ఢిల్లీపై కన్నేశారు. పార్టీని అక్కడ కూడా విస్తరించాలనే ఉద్దేశంతో రేపు ఢిల్లీ వేదికగా ఓ కీలక సమావేశానికి ఏర్పాట్లు చేశారు. ఈ భేటీలోనే ఢిల్లీ వ్యవహారాలను చక్కదిద్దేందుకు ఒక ప్రత్యేక స్టీరింగ్ కమిటీని కూడా ప్రకటించనున్నట్లు తెలుస్తోంది.2024లో జేఎస్పీని ప్రారంభించిన ప్రశాంత్ కిశోర్... 2025 బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఆశించిన ఫలితాలు సాధించలేకపోయారు. ఆ ఎన్నికల్లో పార్టీ ఎలాంటి స్థానాలను గెలుచుకోలేకపోయింది. అయితే, ఈ ఏడాది ఆగస్ట్‌లో జరిగిన బంకిపూర్ ఉప ఎన్నికలో ఆయన స్వయంగా విజయం సాధించి సత్తా చాటారు. ఈ జోష్‌తోనే ఇప్పుడు ఢిల్లీ రాజకీయాల్లోనూ తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాలని చూస్తున్నారు.ముఖ్యంగా ఢిల్లీలో నివసిస్తున్న పూర్వాంచల్ ప్రాంత ప్రజలపై జేఎస్పీ ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు సమాచారం. బీహార్‌కు చెందిన మూలాలున్న ఈ వర్గం ప్రజలు రేపు జరిగే సమావేశానికి పెద్ద ఎత్తున తరలిరానున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం ఢిల్లీ ఓటర్లు బీజేపీ, ఆప్ తీరుతో విసిగిపోయారని, ప్రత్యామ్నాయ వేదిక కోసం చూస్తున్నందున తమ పార్టీని ఆదరిస్తారన్న నమ్మకంతో జేఎస్పీ నేతలు ఉన్నారు. ఢిల్లీ బాధ్యతల కోసం ఏర్పాటు చేయబోయే ఈ స్టీరింగ్ కమిటీలో పలువురు ప్రముఖులు ఉండే అవకాశం ఉంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం... న్యాయవాది తథాగత్ హర్షవర్ధన్, దేశబంధు కాలేజీ ప్రొఫెసర్ శంతను కుమార్, హిమాచల్ ప్రదేశ్ మాజీ ఏడీజీపీ సింగ్ ఈ కమిటీలో కీలక బాధ్యతలు నిర్వర్తించనున్నారు. వీరితో పాటు జేఎస్పీ నేతలు కున్వార్ చంద్రేశ్, అబూ అద్నాన్ ఫరూఖీ, ప్రియాంక సింగ్ తదితరులు కూడా ఇందులో సభ్యులుగా ఉండనున్నట్లు తెలుస్తోంది.



విజయ కెరటం
తెలుగు దినపత్రిక

చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి భావితరాలకు ఆదర్శం





హైదరాబాద్, సెప్టెంబర్ 26 (విజయ కెరటం):

వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి భావితరాలకు ఆదర్శమని తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. ఐలమ్మ జయంతి సందర్భంగా తెలంగాణ శాసనసభ సెంట్రల్ హాల్‌లో ఆమె చిత్రపటానికి శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. భూమి, హక్కులు, ఆత్మగౌరవం కోసం నాటి భూస్వామ్య, పెత్తందారీ వ్యవస్థకు చాకలి ఐలమ్మ ఎదురొడ్డి నిలిచారని తెలిపారు. సామాన్య కుటుంబంలో జన్మించినప్పటికీ అన్యాయాన్ని ప్రశ్నించి, అణచివేతకు వ్యతిరేకంగా ఆమె సాగించిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు.తెలంగాణ సాయుధ పోరాటంలో ఐలమ్మ పోషించిన పాత్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కులు, ఆత్మగౌరవం కోసం ఆమె చేసిన పోరాటం ఎంతోమందిలో చైతన్యం నింపిందన్నారు. మహిళా శక్తికి, ఆత్మగౌరవానికి, పోరాట పటిమకు ఐలమ్మ ప్రతీకగా నిలిచారని అన్నారు. చాకలి ఐలమ్మ వంటి తెలంగాణ పోరాట యోధుల చరిత్రను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. యువత ఆమె జీవితం, పోరాట స్ఫూర్తిని తెలుసుకుని అన్యాయం, అసమానతలకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య పద్ధతుల్లో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్, ఎమ్మెల్యేలు రాజ్ ఠాకూర్, బాలు నాయక్, నవీన్ యాదవ్, మురళీ నాయక్, కోవా లక్ష్మీ, ప్రభాకర్, ఎమ్మెల్సీలు శంకర్ నాయక్, ఎల్. రమణ, తెలంగాణ శాసన మండలి కార్యదర్శి డా. నరసింహాచార్యులు, శాసనసభ కార్యదర్శి ఆర్. తిరుపతి తదితరులు పాల్గొని ఐలమ్మకు నివాళులర్పించారు.

చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఘన నివాళులు జిల్లా ఎస్పీ





సూర్యాపేట, సెప్టెంబర్ 26 విజయ కెరటం ప్రతినిధి:

చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయం ఆవరణలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శ్రీ కె. నరసింహ, ఐపీఎస్ గారు చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ.. చాకలి ఐలమ్మ గారు అణగారిన వర్గాల హక్కుల కోసం ధైర్యంగా పోరాడిన గొప్ప పోరాట యోధురాలని అన్నారు. సామాజిక అన్యాయం, దోపిడీకి వ్యతిరేకంగా ఆమె సాగించిన పోరాటం, జీవితంలో ఎదురైన ఎన్నో కష్టాలను ధైర్యంగా ఎదుర్కొన్న తీరు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఐలమ్మ గారి పోరాట పటిమ, ఆత్మవిశ్వాసం, ధైర్యసాహసాలు నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. సమాజంలో సమానత్వం, న్యాయం కోసం ఆమె చేసిన పోరాటాన్ని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని ఎస్పీ గారు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, ఆర్ఐ జానయ్య, ఫింగర్‌ప్రింట్స్ ఇన్‌స్పెక్టర్ నవీన్ కుమార్, వెల్ఫేర్ ఆర్ఎస్ఐ సాయిరాం, ఆర్ఎస్ఐ అన్వర్ తదితర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఖైరతాబాద్ ఉప ఎన్నిక బరిలో కవిత పార్టీ

తెలంగాణ రక్షణ సేన తరఫున అభ్యర్థిని నిలబెడతామని ప్రకటన

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (విజయ కెరటం):



ఖైరతాబాద్ అసెంబ్లీ ఉప ఎన్నికలో తెలంగాణ రక్షణ సేన (TRS) పోటీ చేయనున్నట్లు ఆ పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రకటించారు. బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె ఈ విషయాన్ని వెల్లడించారు. ? ఒక పార్టీ తరఫున గెలిచి మరో పార్టీలోకి మారే ప్రజాప్రతినిధుల తీరుపై కవిత విమర్శలు చేశారు. ఇలాంటి రాజకీయాలపై ఉప ఎన్నికల ద్వారా ప్రజలు స్పందించాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు.వైద్యం, విద్యపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తాంరాష్ట్రంలో విద్య, వైద్య రంగాల పరిస్థితిపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని కవిత తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో చిన్నారుల మరణాలకు సంబంధించి ఆర్టీఐ ద్వారా లభించిన గణాంకాలను ప్రస్తావిస్తూ ప్రభుత్వ వైద్య వ్యవస్థపై ఆమె పలు ఆరోపణలు చేశారు. ఆరోగ్యశ్రీ బకాయిలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో బెడ్ల కొరత వంటి అంశాలను కూడా ఆమె ప్రస్తావించారు.వైద్య రంగానికి బడ్జెట్ కేటాయింపులు, నిధుల వినియోగంపై కూడా కవిత ప్రభుత్వాన్ని విమర్శించారు. అయితే ఈ అంశాలపై ఆమె చేసిన గణాంకాలు, ఆరోపణలు ఆమె వ్యాఖ్యలుగానే పరిగణించాలి.

ఫామ్‌హౌస్ భూములపై సవాల్

తన ఫామ్‌హౌస్‌కు సంబంధించి వస్తున్న ఆరోపణలను కవిత ఖండించారు. ఎలక్షన్ అఫిడవిట్‌లో పేర్కొన్న ఆస్తుల కంటే అదనంగా ఒక్క రూపాయి విలువైన ఆస్తి ఉన్నట్లు నిరూపిస్తే మొత్తం ఆస్తిని ప్రభుత్వానికి రాసిస్తానని ఆమె సవాల్ చేశారు ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు వివిధ కేసులు, విచారణల అంశాలను తెరపైకి తెస్తోందని ఆమె ఆరోపించారు. దీనిపై అధికార పక్షం స్పందన వేరుగా ఉండవచ్చు. ఎస్ఐఆర్, సాగునీరు, తాగునీటిపైనా ప్రస్తావన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) ప్రక్రియపై కూడా కవిత ప్రశ్నలు లేవనెత్తారు. చిన్నపాటి క్లరికల్ తప్పిదాలతో ఓట్లు తొలగిస్తున్నారని ఆరోపించారు. సాగునీరు, తాగునీటి సమస్యలపై త్వరలో కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు.

శివరాం నగర్‌లో ఘనంగా మట్టి వినాయకుడి స్వహస్త అభిషేక నిమజ్జనం

పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలనే ప్రతిష్ఠించాలి: డీఎస్పీ శివరాం రెడ్డి

నల్లగొండ, సెప్టెంబర్ 26 (విజయ కెరటం):

నల్లగొండ పట్టణంలోని 38వ డివిజన్ శివరాం నగర్‌లో బజరంగీ యూత్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం మట్టి వినాయకుడికి స్వహస్త అభిషేక నిమజ్జన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ప్రతి ఇంటి నుంచి భక్తులు తీసుకొచ్చిన పసుపు, కుంకుమ కలిపిన నీటితో వినాయకుడికి స్వయంగా అభిషేకం చేసి నిమజ్జనం చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నల్లగొండ డీఎస్పీ శివరాం రెడ్డి, ముఖ్యవక్తగా ఆధ్యాత్మిక విశ్లేషకులు, సామేరి పంచానన దివ్య పీఠం ప్రధాన సంచాలకులు ఆర్కే వేదాంతం పాల్గొన్నారు. తోగోటి రమేష్ మాస్టర్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డీఎస్పీ శివరాం రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమానికి తనను ఆహ్వానించడం సంతోషంగా ఉందన్నారు. భక్తులు తమ ఇళ్ల నుంచి తీసుకొచ్చిన పసుపు, కుంకుమ నీటితో స్వయంగా అభిషేకం చేయడం విశిష్టమైన కార్యక్రమమని పేర్కొన్నారు. భారీ విగ్రహాలకు బదులుగా మట్టి వినాయకులను ప్రతిష్ఠించి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు.మహిళలు నిర్వహించిన భజన కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భజనలతో శివరాం నగర్‌లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది . కార్యక్రమం లో బజరంగీ యూత్ సభ్యులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



అసైన్డ్ భూములపై సీఎం హామీ అమలు అభినందనీయం

దళితులకు భూమి పంపిణీ నిర్ణయానికి అర్షం అశోక్ కృతజ్ఞతలు

వరంగల్ విజయ కెరటం, సెప్టెంబర్ 25:



అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పించడంతో పాటు అర్హులైన దళితులకు భూమి పంపిణీ చేయాలనే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అర్షం అశోక్ స్వాగతించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.హనుమకొండ బాలసముద్రంలో శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేసి మాట్లాడుతూ.. అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పించడం దళిత కుటుంబాల భూ హక్కులు, ఆత్మగౌరవం, ఆర్థిక భద్రతకు ఎంతో కీలకమన్నారు. అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కులు కల్పిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చట్టసభలో ఇచ్చిన హామీ మేరకు నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు.గతంలో వివిధ కారణాలతో దళిత కుటుంబాలకు ఏర్పడిన భూ సమస్యలను సమగ్రంగా పరిశీలించి అర్హులకు న్యాయం చేయాలని అర్షం అశోక్ కోరారు. దళితుల భూములకు సంబంధించిన పెండింగ్ సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, అన్యాయంగా ఇతరుల పేర్లకు మారినట్లు తేలిన భూములను గుర్తించి అసలు అర్హులైన హక్కుదారులకు తిరిగి అందించాలని విజ్ఞప్తి చేశారు.అలాగే అసైన్‌మెంట్ యాక్ట్--1977 ప్రకారం మార్టేజ్ లోన్స్‌ను పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని కోరారు. దళితుల భూ హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు వారి సామాజిక, ఆర్థిక అభివృద్ధికి దోహదపడతాయని పేర్కొంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అర్షం అశోక్ మరోసారి కృతజ్ఞతలు తెలిపారు.

ఆపద వేళ అండగా ఆపదమిత్రలు

వాలంటీర్లకు రక్షణ కిట్ల పంపిణీ

వరంగల్ విజయ కెరటం , సెప్టెంబర్ 26:



విపత్తులు, అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు తక్షణ సహాయం అందించేందుకు ఆపదమిత్ర వాలంటీర్లు సిద్ధంగా ఉండాలని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారులు సూచించారు.శనివారం హనుమకొండ జిల్లా అగ్నిమాపక కేంద్రంలో డీఎఫ్ఓ సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆపదమిత్ర వాలంటీర్లకు రక్షణ కిట్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా డీఎఫ్ఓ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. నగరంలో వరదలు, భవనాల కూల్చివేతలు, రోడ్డు ప్రమాదాలు వంటి విపత్కర పరిస్థితుల్లో ఆపదమిత్ర వాలంటీర్లు ప్రజలకు అందుబాటులో ఉండి సహాయక చర్యల్లో పాల్గొనాలని సూచించారు. విపత్తుల సమయంలో తక్షణ స్పందనతో ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించడంలో వాలంటీర్లు కీలకంగా వ్యవహరించాలన్నారు. ఎస్ఎఫ్ఓ భద్రయ్య మాట్లాడుతూ.. ఇళ్లలో ప్రమాదాలు జరిగినప్పుడు, పాము కాటు, గుండెపోటు వంటి అత్యవసర పరిస్థితుల్లో ఆపదమిత్ర వాలంటీర్ల సేవలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. ప్రమాద సమయంలో ప్రాథమిక సహాయం అందిస్తూ బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో వాలంటీర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.ఆపదమిత్ర వాలంటీర్ సీపతి రాజు మాట్లాడుతూ.. విపత్తులు సంభవించిన సమయంలో అగ్నిమాపక శాఖ అధికారుల సూచనల మేరకు ప్రజలకు సహాయం అందించేందుకు తాము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని తెలిపారు.కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ సిబ్బంది, పరకాల ఆపదమిత్ర వాలంటీర్లు పాల్గొన్నారు.

వీరనారి చాకలి ఐలమ్మ జయంతి ఘనంగా నిర్వహణ

నల్లగొండ, సెప్టెంబర్ 26 (విజయ కెరటం):



నల్లగొండ పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి క్యాంపు కార్యాలయంలో శనివారం వీరనారి చాకలి ఐలమ్మ 131వ జయంతిని ఘనంగా నిర్వహించారు.నల్లగొండ మాజీ జెడ్పీటీసీ గుమ్ముల మోహన్‌రెడ్డి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ఆమె చేసిన ధైర్యసాహసాలను, పోరాట స్ఫూర్తిని కొనియాడారు.ఈ కార్యక్రమంలో పీఏ ఏదుళ్ల మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కత్తుల కోటి, జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు పాదం అనిల్, పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గాలి నాగరాజు, పెరిక అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

12వ బెటాలియన్‌లో సాకలి ఐలమ్మ జయంతి వేడుకలు

నల్లగొండ, సెప్టెంబర్ 26 (విజయ కెరటం):



తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, ధీరవనిత సాకలి ఐలమ్మ 131వ జయంతిని పురస్కరించుకుని అన్నేపర్తిలోని 12వ బెటాలియన్ TGSPలో శనివారం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. 12వ బెటాలియన్ కమాండెంట్ బి. రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సామాజిక న్యాయం కోసం ఆమె చేసిన పోరాటాన్ని, ధైర్యసాహసాలను స్మరించుకున్నారు.కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ నర్సింగ్ వెంకన్న, డాక్టర్ షర్మిలా దేవి, ఆర్ఐలు నితిన్ గౌతమ్, ఆర్ఎస్ఐలు, మినిస్టీరియల్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది, హోంగార్డులు తదితరులు పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి భావితరాలకు ఆదర్శం

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (విజయ కెరటం):



వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి భావితరాలకు ఆదర్శమని తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. ఐలమ్మ జయంతి సందర్భంగా తెలంగాణ శాసనసభ సెంట్రల్ హాల్‌లో ఆమె చిత్రపటానికి శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. భూమి, హక్కులు, ఆత్మగౌరవం కోసం నాటి భూస్వామ్య, పెత్తందారీ వ్యవస్థకు చాకలి ఐలమ్మ ఎదురొడ్డి నిలిచారని తెలిపారు. సామాన్య కుటుంబంలో జన్మించినప్పటికీ అన్యాయాన్ని ప్రశ్నించి, అణచివేతకు వ్యతిరేకంగా ఆమె సాగించిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు.తెలంగాణ సాయుధ పోరాటంలో ఐలమ్మ పోషించిన పాత్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కులు, ఆత్మగౌరవం కోసం ఆమె చేసిన పోరాటం ఎంతోమందిలో చైతన్యం నింపిందన్నారు. మహిళా శక్తికి, ఆత్మగౌరవానికి, పోరాట పటిమకు ఐలమ్మ ప్రతీకగా నిలిచారని అన్నారు. చాకలి ఐలమ్మ వంటి తెలంగాణ పోరాట యోధుల చరిత్రను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. యువత ఆమె జీవితం, పోరాట స్ఫూర్తిని తెలుసుకుని అన్యాయం, అసమానతలకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య పద్ధతుల్లో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్, ఎమ్మెల్యేలు రాజ్ ఠాకూర్, బాలు నాయక్, నవీన్ యాదవ్, మురళీ నాయక్, కోవా లక్ష్మీ, ప్రభాకర్, ఎమ్మెల్సీలు శంకర్ నాయక్, ఎల్. రమణ, తెలంగాణ శాసన మండలి కార్యదర్శి డా. నరసింహాచార్యులు, శాసనసభ కార్యదర్శి ఆర్. తిరుపతి తదితరులు పాల్గొని ఐలమ్మకు నివాళులర్పించారు.

విజయ కెరటం
తెలుగు దినపత్రిక

రైతులుఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలి

సెప్టెంబర్ 30 వరకు గ్రామాల్లో ప్రత్యేక నమోదు కార్యక్రమం

నల్లగొండ, సెప్టెంబర్ 26 (విజయ కెరటం):



రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వ్యవసాయ సేవలను సులభంగా, పారదర్శకంగా అందించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న అగ్రిస్టాక్--ఫార్మర్ రిజిస్ట్రీలో ప్రతి రైతు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సూచించారు.ఇందులో భాగంగా సెప్టెంబర్ 30 వరకు జిల్లాలోని గ్రామాల్లో ప్రత్యేక ఫార్మర్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు ఆధార్ కార్డుతో సంబంధిత ఏఈఓను సంప్రదించి నమోదు చేసుకోవచ్చని, లేదా సమీప మీ సేవా కేంద్రాల్లోనూ రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చని పేర్కొన్నారు. నమోదు సమయంలో ఆధార్ కార్డు, భూమికి సంబంధించిన పత్రాలు, మొబైల్ ఫోన్ తదితర వివరాలను వెంట తీసుకెళ్లాలని సూచించారు.ఫార్మర్ రిజిస్ట్రీతో ప్రయోజనాలు ఫార్మర్ రిజిస్ట్రీ ద్వారా రైతుల భూమి, పంటలు, ఇతర వ్యవసాయ సంబంధిత వివరాలను డిజిటల్‌గా నమోదు చేస్తారు. దీని ద్వారా అర్హులైన రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ పథకాల ప్రయోజనాలు అందించేందుకు వీలుంటుంది.ఎరువుల బుకింగ్, పీఎం కిసాన్ ప్రయోజనాలు పొందడం, వరి, పత్తి తదితర పంటలను విక్రయించడం, పంట రుణాలు పొందడం, ఇతర ప్రభుత్వ పథకాల లబ్ధి పొందేందుకు ఫార్మర్ రిజిస్ట్రీ ఉపయోగపడుతుందని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు.కావున జిల్లాలోని ప్రతి రైతు సెప్టెంబర్ 30లోగా తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కోరారు.

దివ్యాంగులకు ఉచిత సహాయక పరికరాల కోసం ప్రత్యేక శిబిరాలు

నల్లగొండ జిల్లాలో సెప్టెంబర్ 28 నుంచి నాలుగు రోజుల పాటు నిర్వహణ

నల్లగొండ, సెప్టెంబర్ 26 (విజయ కెరటం):



దివ్యాంగులకు అవసరమైన సహాయక పరికరాలను అందించేందుకు భారతీయ కృత్రిమ అవయవముల తయారీ సంస్థ (ALIMCO--హైదరాబాద్) ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లాలో ప్రత్యేక గుర్తింపు, అంచనా శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా అధికారులు తెలిపారు.జిల్లాలోని 33 మండలాలకు చెందిన దివ్యాంగుల కోసం బ్యాటరీ ఆపరేటెడ్ ట్రైసైకిళ్లు, వీల్‌చైర్లు, ట్రైసైకిళ్లు, శ్రవణ పరికరాలు, స్మార్ట్ కేన్ తదితర సహాయక పరికరాల కోసం అర్హులను గుర్తించనున్నారు.

శిబిరాల తేదీలు, వేదికలు:

సెప్టెంబర్ 28: నల్లగొండ డివిజన్ దివ్యాంగులకు -- టీఎన్‌జీవోస్ భవన్, ప్రకాశం బజార్, నల్లగొండ.

సెప్టెంబర్ 29: మిర్యాలగూడ డివిజన్ దివ్యాంగులకు -- రైతు వేదిక, ఎంపీడీఓ కార్యాలయం, మిర్యాలగూడ.

సెప్టెంబర్ 30: దేవరకొండ డివిజన్ దివ్యాంగులకు -- గిరిజన భవన్, దేవరకొండ.

అక్టోబర్ 1: చందూర్ డివిజన్ దివ్యాంగులకు -- తహసీల్దార్ కార్యాలయం, చందూర్.

తీసుకురావాల్సిన పత్రాలు దివ్యాంగులు సదరం సర్టిఫికెట్, ఆదాయ ధ్రువీకరణ పత్రం/రేషన్ కార్డు, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫొటో, UDID కార్డు తదితర పత్రాలను వెంట తీసుకురావాలని అధికారులు సూచించారు. శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చాకలి ఐలమ్మకు ఘన నివాళి

తెలంగాణ భవన్‌లో చిత్రపటానికి పూలమాలలు వేసిన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (విజయ కెరటం):



వీరనారి చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆమె చిత్రపటానికి పలువురు బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్, మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు, భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, ఆలేరు మాజీ ఎమ్మెల్యే బిక్షమయ్య గౌడ్, హుజూర్‌నగర్ ఇన్‌చార్జి ఒంటెద్దు నరసింహారెడ్డి పాల్గొన్నారు. చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని ఈ సందర్భంగా వారు స్మరించుకున్నారు.

నల్లగొండ లతీఫ్‌షా దర్గా ఉర్సుకు శ్రీకారం.. అక్టోబర్ 1 నుంచి మూడు రోజుల వేడుకలు

నల్లగొండ, సెప్టెంబర్ 26 (విజయ కెరటం):



నల్లగొండ పట్టణంలోని హజ్రత్ సయ్యద్ షా లతీఫ్ ఉల్లా ఖాద్రీ రహ్మతుల్లాహి అలైహి దర్గా ఉర్సు-ఏ-షరీఫ్ ఉత్సవాలకు శనివారం శ్రీకారం చుట్టారు. అక్టోబర్ 1 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఉర్సు ఉత్సవాల పోస్టర్‌ను మాజీ మున్సిపల్ వైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మాజీ పట్టణ అధ్యక్షులు, జడ్పీటీసీ గుమ్ముల మోహన్ రెడ్డి ఆవిష్కరించారు.ఉర్సు తొలి రోజు స్థానిక మదీనా మసీదు నుంచి గంధం ఊరేగింపు నిర్వహించి ప్రత్యేక ప్రార్థనలు చేపట్టనున్నారు. రెండో రోజు దర్గా వద్ద దీపాలంకరణతో పాటు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. మూడో రోజు ఘనంగా ఖవ్వాలి కార్యక్రమం ఏర్పాటు చేయనున్నారు. తెలంగాణతో పాటు ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరానున్న నేపథ్యంలో తాగునీరు, విద్యుత్, ఇతర మౌలిక వసతుల ఏర్పాట్లపై ఉర్సు కమిటీ ప్రత్యేక దృష్టి సారించింది.ఉర్సు కమిటీ, ఇనాందార్లు, ముతవల్లీలు, ముస్లిం సమాజ పెద్దల ఆధ్వర్యంలో ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. పోస్టర్ ఆవిష్కరణతో ఉర్సు వేడుకల ఏర్పాట్లు అధికారికంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో నల్లగొండ పట్టణ అధ్యక్షులు ఎడ్ల శ్రీనివాస్ యాదవ్, కాంగ్రెస్ కార్పొరేటర్లు 22 డివిజన్ కార్పొరేటర్ సయ్యద్ సమద్, ఉర్సు కమిటీ సభ్యులు, ఇనాందార్లు, ముతవల్లీలు తదితరులు పాల్గొన్నారు.


ప్రశాంతంగా ముగిసిన గణేష్ నిమజ్జనం.. ప్రజలకు కలెక్టర్, ఎస్పీ కృతజ్ఞతలు

నల్లగొండ, సెప్టెంబర్ 26 (విజయ కెరటం):



నల్లగొండ జిల్లాలో గణేష్ నిమజ్జనం ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంతంగా ముగిసింది. ప్రజలు, ప్రజాప్రతినిధులు, గణేష్ ఉత్సవ కమిటీలు, అధికారులు, పోలీసు సిబ్బంది సమన్వయంతో నిమజ్జన కార్యక్రమం విజయవంతంగా నిర్వహించినట్లు కలెక్టర్ బి. చంద్రశేఖర్, ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. నిమజ్జనం ప్రశాంతంగా జరిగేందుకు సహకరించిన జిల్లా ప్రజలు, ఉత్సవ కమిటీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బందికి వారు కృతజ్ఞతలు తెలిపారు. ముందస్తు ప్రణాళికలు, పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు, శాఖల మధ్య సమన్వయంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా గణపతి నవరాత్రి ఉత్సవాలు విజయవంతంగా ముగిశాయని పేర్కొన్నారు. శనివారం కలెక్టర్‌ను కలిసిన పలువురు గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులను కలెక్టర్, ఎస్పీ అభినందించి శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, డీఆర్ఓ దశరథ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లాపులు తట్టుకోలేక పరేషాన్ అవుతున్న బ్యూటీలు!



ఫ్లాపులతో సతమతమైన కృతి శెట్టి

చెలాకీగా ఉండే శ్రీలీలకి తప్పని తిప్పలు

పాలరాతి శిల్పం అనిపించుకున్న భాగ్యశ్రీ బోర్సే

అదృష్టం కలిసిరాక తగ్గిన అవకాశాలు

వెండితెరపై కథానాయిక అందంగా ఉండాలి .. ఆకర్షణీయంగా అనిపించాలి. దిష్టి చుక్క పెట్టని చందమామలా కనిపించాలి. లేదంటే ఆడియన్స్ నిరాశపడిపోతారు .. నిరుత్సాహానికి లోనవుతారు. తెరపై సమాజసేవలో అలసిపోయిన నాయకుడికి .. ఆ నాయకుడికి విజిల్స్ కొట్టి విసిగిపోయిన ఆడియన్స్ కి కాస్త ఉపశమనాన్ని కలిగించేది హీరోయిన్ అనడంలో ఎలాంటి సందేహం లేదు. అలాంటి హీరోయిన్ అందంగా ఉండాలని అనుకోవడంలోను తప్పులేదు. అభిమానుల మనసు దోచుకుంటూ .. అవకాశాలను అందుకుంటూ .. విజయాలను సొంతం చేసుకోవడం అంత తేలికైన విషయమేం కాదు. ఇక్కడ హిట్టు తప్ప వాళ్లను కాపాడే మరో మంత్రమే లేదు. ఒకప్పుడు హీరోయిన్స్ ఏళ్లతరబడి ఏలుతూ వెళ్లారు. కానీ ఇప్పుడు ట్రెండ్ మారిపోయింది. ఎంత గ్లామరస్ గా ఉన్నప్పటికీ .. ఎంత టాలెంట్ ఉన్నప్పటికీ రెండు మూడు ఫ్లాపులు పడితే అంతే సంగతులు. మేకప్ కిట్ సర్దుకుని మరో ఇండస్ట్రీకి వెళ్లడం తప్ప మరో మార్గం లేదు. కృతి శెట్టి ఇచ్చిన ఎంట్రీ మామూలుగా లేదు. ఫస్టు మూవీతోనే 100 కోట్ల బ్యూటీగా మార్కులు కొట్టేసింది. అరుదైన ఫీట్ గా చెప్పుకునే హ్యాట్రిక్ హిట్ ను దక్కించుకుని అందరినీ ఆశ్చర్యపరిచింది. ఇక కుదురుకున్నట్టే అనుకునేంతలోనే పరాజయాల పలకరింపు మొదలైంది. అప్పటి నుంచి కృతి శెట్టి ఇక్కడ కనిపించలేదు. ఆ సమయంలో వరుస విజయాలతో చెలరిగిపోయిన శ్రీలీలకి కూడా ఆ తరువాత ఫ్లాపులు తప్పలేదు. ఆమె జోరు తగ్గడానికి కూడా ఎక్కువ సమయం పట్టలేదు.ఈ నేపథ్యంలోనే విశాలమైన కళ్లతో విన్యాసాలు చేసుకుంటూ భాగ్యశ్రీ బోర్సే తెరపైకి వచ్చింది. అమ్మాయి గ్లామర్ కి వంకబెట్టవలసిన అవసరం లేదని ఆడియన్స్ అనుకున్నారు. కుర్రాళ్లంతా కూడబలుక్కుని ఆమె అభిమానుల జాబితాలో చేరిపోయారు. కానీ సక్సెస్ అనేక విధాలుగా ఆమెతో దోబూచులాడుతూనే వచ్చింది. దాంతో ఆమె కూడా ఇతర భాషా చిత్రాల వైపు అడుగులు వేయవలసి వచ్చింది. ఎంత అందంగా ఉన్నా .. టాలెంట్ ఉన్నా కొంత కాలం కూడా నిలదొక్కుకోలేక పోతుండటం నిజంగా విచారించదగిన విషయమే.

Printed, Published Edited and Owned by MAKSOOD AHAMED MOHAMED,H.No. 5-8-222/1, Shams Nagar, BTS Nalgonda - 508 001 (Telangana State) Printed at Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA 508 001, (Telangana State), Published From: Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA - 508 001 (A.P.), Editor: MAKSOOD AHAMED MOHAMED Cell: 9908408528